క్లుప్తంగా

తహసీల్దార్‌గా నాగరాజు



కార్వేటినగరం: మండల తహసీల్దార్‌గా కె.నాగరాజు శనివారం పదవీ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఆయన పాలసముద్రం మండలంలో డీటీగా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇన్‌చార్జి తహసీల్దార్‌గా కార్వేటినగరం వచ్చారు. కార్వేటినగరం తహసీల్దార్‌గా పనిచేసిన భగవతి సెలవుపై వెళ్లారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి తహసీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ సిబ్బంది సమయపాలన పాటించి రైతులకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని తెలిపారు. భూ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని, విద్యార్థులకు కావాల్సిన ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయడంలో జాప్యం లేకుండా చూస్తానని ఆయన పేర్కొన్నారు. ఆయనకు సిబ్బందిది పుష్పగుచ్ఛం అందించి, శాలువాలతో ఘనంగా సన్మానించారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా



బలిజకండ్రిగలో ఓటర్ల నుంచి దరఖాస్తులు తీసుకుంటున్న బీఎల్‌ఓలు

పాలసముద్రం: ఓటర్ల జాబితా, సవరణ పారదర్శకంగా చేపట్టాలని తహసీల్దార్ అరుణ కుమారి సిబ్బందిని ఆదేశించారు. ఆదివారం కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని 23 మంది బీఎల్‌ఓల ద్వారా ఆయా కేంద్రాల్లో స్పెషల్ క్యాంప్ నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఓటర్ల స్పెషల్ క్యాంపులో 28 క్లయిమ్‌లు వచ్చాయన్నారు.

నేడు శివాలయాల్లో కార్తీక పూజలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలో సోమవారం కార్తీక పూజలను ఘనంగా నిర్వహించనున్నారు. ప్రధానంగా కట్టమంచిలోని కుళందీశ్వర ఆలయం, ఈశ్వరగుడివీధిలోని అగస్తీశ్వరస్వామి ఆలయం, ఇరువారంలోని నాగేశ్వర ఆలయం, నీవానది ఒడ్డున ఉన్న రాజుగుడిలో కార్తీక పూజలు వైభవంగా జరగనున్నాయి. భక్తులు పెద్దసంఖ్యలో తరలిరానున్న నేపథ్యంలో ఆయా ఆలయాల నిర్వాహకులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు.

ప్రవచనం.. పరిపూర్ణం



మాట్లాడుతున్న గరికపాటి నరసింహారావు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): భూత, భవిష్యత్ గురించి ఆలోచించవద్దని గరికపాటి నరసింహారావు తెలిపారు. చిత్తూరు నగరంలోని నాగయ్య కళాక్షేత్రంలో నిర్వహించిన యోగవాశిష్ట్యంపై ప్రవచన కార్యక్రమం ఆదివారంతో పరిపూర్ణమైంది. గరికపాటి మాట్లాడుతూ విచిత్రమైన ఆలోచనలే ఆరోగ్యాన్ని, మనసును పాడు చేస్తాయన్నారు. పనిని శ్రద్ధగా చేస్తూ ముందుగా వెళ్లాలని సూచించారు. అనంతరం ఆయన్ను నిర్వాహకుడు కల్యాణ్ ఘనంగా సన్మానించారు. అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.


‘జర్నలిస్టుల సమస్యలపై రాజీలేని పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ సభ్యులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఏపీయూడబ్ల్యూజే) నిరంతరం పోరాడుతోందని ఆ సంఘం చిత్తూరు జిల్లా అధ్యక్షుడు లోకనాథం, కార్యదర్శి మురళీకృష్ణ తెలిపారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏపీయూడబ్ల్యూజే నూతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఏపీయూడబ్ల్యూజే బలోపేతంతోపాటు చిత్తూరులో కార్యాలయాన్ని నిర్మించుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కె.ఎం అశోక్ కుమార్, ఉపాధ్యక్షులు మురహరిరెడ్డి, శివ, జాయింట్ సెక్రటరీ ఇషార్ అహ్మద్, కోటీశ్వర్ యాదవ్, చంద్రమోహన్, కార్యవర్గ సభ్యులు సురేష్, జగన్నాథం, జీవన్, ఖాన్, వెంకటేశులు, గోవిందస్వామి, రమేష్, ఉదయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం



క్రికెట్ టోర్నీ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నగరి: మున్సిపల్ పరిధిలోని తిరుపతి రోడ్డులో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సమీపంలో 7కె వారియర్స్ బాక్స్ క్రికెట్ టోర్నీని రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ టోర్నీని ఆదివారం ఉదయం స్థానిక ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ప్రారంభించారు. క్రీడాకారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక ముసుగులో టీడీపీ నాయకుల దందా హద్దులు దాటుతోంది. పగలు డంప్ చేసుకున్న ఇసుకను రాత్రిళ్లు తమిళనాడుకు తరలించేస్తున్నారు. ఉచిత ఇసుక పేరుతో అధికార పార్టీకి చెందిన ట్రాక్టర్ల యజమానులు పెద్ద ఎత్తున సొమ్ము చేసుకుంటున్నారు. – పాలసముద్రం

తమిళనాడుకు తరలించేందుకు ఇసుక లోడింగ్



పగలు డంపింగ్.. రాత్రిళ్లు జంపింగ్

- తమిళనాడుకు ఇసుక తరలింపు
- సొమ్ము చేసుకుంటున్న అధికార పార్టీ నేతలు



సింహరాజుపురంలో తమిళనాడుకు తరలించేందుకు ఇసుక డంప్

పగటిపూట ఎన్‌ఆర్ పేట నీవానది నుంచి ట్రాక్టర్లలో ఇసుకను తమిళనాడు సరిహద్దుల్లో ఉన్న సింహరాజుపురం, వనదుర్గాపురం, గంగమాంబపురం గ్రామాల్లో నిల్వ చేస్తున్నారు. రాత్రిళ్లు తమిళనాడు రాష్ట్రానికి ట్రాక్టర్లకు లోడింగ్ చేస్తున్నారు. ఈ తంతు బహిరంగంగా సాగుతున్న అధికారులు చోద్యం చూస్తున్నారు. దీంతో వివిధ గ్రామాల ప్రజలు, వాహన చోదకులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా గంగాధరనెల్లూరు కాలువలో నీవానదిలో పగలంతా ట్రాక్టర్లతో తీసుకొచ్చి ఇక్కడ డంపింగ్ చేస్తున్నారు. ఆ తర్వాత రాత్రి 10 గంటల తర్వాత లోడ్ చేస్తున్నారు. ఒక ట్రాక్టరు ఇసుక రూ 15 వేలు, టిప్పర్ రూ.50 వేలకు విక్రయిస్తున్నట్లు సమాచారం. ఈ ర్యాంపులో కూలీలకు రూ.600 చెల్లిస్తున్నారు. దీంతో ఉచితం పేరున పలువురు నాయకులు సొమ్ము చేసుకుంటున్నారు. ప్రస్తుతం సింహరాజుపురంలో డంప్ చేసిన ఇసుక రెండు రోజుల్లో తమిళనాడుకి టిప్పర్‌లో రాత్రికిరాత్రే తరలిస్తున్నారు.

సీజ్ చేసిన ఇసుక మాయం

గతంలో తమిళనాడు సరిహద్దులో డంప్ చేసిన ఇసుకను ఫిర్యాదులు రావడంతో సీఐ, ఎస్‌ఐ కలసి సీజ్ చేశారు. దీనికి సంబంధించిన వారిపై కూడా కేసులు పెట్టారు. అయితే అధికార బలంతో సీజ్ చేసిన ఇసుకను కూడా రాత్రికి రాత్రే తమిళనాడుకి తరలించేశారు. అప్పుడు కూడా పోలీసులు పట్టించుకోలేదు.

ఇసుక మాఫియా

సింహరాజుపురంలో డంపు చేసినవారు గతంలో పట్టుబడిన ఇసుక మాఫియా నాయకులే. అయినా పోలీసులు మాత్రం అటువైపు వెళ్లడం లేదు. రాత్రి సమయంలో ఇసుక తరలిస్తున్నట్టు పోలీసులకు తెలిసినా తెలియనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు ఇసుక అక్రమ రవాణాని అరికట్టాలి.

వాహనదారుల ఇక్కట్లు

రోడ్డుపై ఇసుక ట్రాక్టర్లు విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. భారీ లోడ్లతో అతివేగంగా వస్తున్నారు. దీంతో రహదారిపై దుమ్ముధూళితో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వాహనాల రాకపోకలకు కష్టతరంగా ఉంది. ఇప్పటికైనా రెవెన్యూ, పోలీసులు, మైనింగ్, విజిలెన్స్ అధికారులు స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. రోడ్లపై పిల్లలు రావాలంటే భయపడుతున్నారు. ట్రాక్టర్లతో ఇసుక తీసుకెళ్తున్నప్పుడు వాటిపై టార్పాలిన్లు వేయడం లేదు. కళ్లల్లో ఇసుక ఎగిరి పడుతోంది. అలాగే పంచాయతీకి కూడా పైసా ఆదాయం లేదు. అధికారులు తగిన చర్యలు తీసుకుని చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం



“గృహ నిర్మాణదారులకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీ పెట్టింది. దీనిని ఆసరాగా చేసుకుని కొంతమంది తమిళనాడుకు రాత్రి సమయంలో ఇసుక తరలించేస్తున్నారు. ఇసుక దందా సాగుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. చర్యలు తీసుకుంటాను. – అరుణకుమారి, తహసీల్దార్, పాలసముద్రం

తమిళనాడుకి తరలిస్తే చర్యలు



ప్రభుత్వం గృహ నిర్మాణానికి ఉచిత ఇసుక ఇస్తున్నారు. ఇంటి పనులకు వంక, కాలువల్లో ఇసుక తీసుకోవచ్చు. దీన్ని అదునుగా తీసుకుని అక్రమంగా తమిళనాడుకి ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవు.

– హనుమంతప్ప, కార్వేటినగరం

భూ అక్రమాలపై చర్యలు తీసుకోవాలి



ప్రజాపోరులో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

నగరి: సత్రవాడలో భూ అక్రమాలపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా పోరు కార్యక్రమాన్ని ఆదివారం సత్రవాడ, తెరణి దళితవాడలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్రవాడలో గ్రామకంఠం కాలువ పొరంబోకు భూములు ఉన్నప్పటికీ ప్రైవేటు వ్యక్తులు ఆ భూములను ఆక్రమించేస్తూ ప్రజలపై దౌర్జన్యాలకు పాల్పడుతున్నారన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామ అవసరాల కోసం గ్రంథాలయం, క్రీడా మైదానం కావాలని పదే పదే అడుగుతున్నప్పటికీ స్థలాలు లేవని అధికారులు కుంటి సాకులు చెబుతున్నారన్నారు. శ్మశానం ఉన్నప్పటికీ ఆక్రమణకు గురైందన్నారు. అధికారులు ఈ అంశాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యువనాయకులు తంగరాజు, సందీప్, రాజా, లోకేష్, గుణశేఖర్, ఉమాపతి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

నల్లబెల్లం ఊట ధ్వంసం



ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

వెదురుకుప్పం: నక్కలాంపల్లె గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో ఆదివారం నాటు సారా స్థావరాలపై వెదురుకుప్పం పోలీసులు దాడులు నిర్వహించారు. వెదురుకుప్పం పోలీసులు 2000 లీటర్ల నల్లబెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. జిల్లా ఎస్పీ ఆదేశాలతో నక్కలాంపల్లె గ్రామానికి సమీపంలోని అటవీ ప్రాంతంలో నాటు సారా తయారీ కేంద్రాలపై దాడులు చేశారు. ఎస్‌ఐతో పాటు పోలీసు సిబ్బంది గంగయ్య, కల్యాణ్, గణేష్‌తో కలిసి రహస్య ప్రాంతాల్లో ఉన్న బట్టీలను గుర్తించి దాడులు చేశారు. ఈ దాడుల్లో నాటు సారా తయారీకి నిల్వ ఉంచిన 2 వేల లీటర్ల నల్లబెల్లం ఊటను ధ్వంసం చేశారు. 30లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. నాటు సారా తయారీపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. మండలంలో ఎక్కడైనా నాటు సారా తయారు చేసినట్లు తెలిస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వ నిషేధిత కార్యకలాపాలకు ఎవరు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆలయం వద్ద అన్నదానం



శ్రీవేణుగోపాలస్వామి ఆలయ ఆవరణలో అన్నదానం

కార్వేటినగరం: సుప్రసిద్ధ రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో ఆదివారం అన్నదానం నిర్వహించారు. టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో పుత్తూరు పట్టణానికి చెందిన యుగంధర్ కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి భక్తుడు ముందుకొచ్చి వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రతి శుక్రవారం, శనివారంలోనే కాకుండా దాతల ఇష్టానుసారం రోజూ నిర్వహించే అన్నదాన కార్యక్రమంలో పాలు పంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుగంధర్ కుటుంబ సభ్యులు, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొన్న కారు



కారు ఢీకొని కిందపడ్డ ట్రాన్స్‌ఫార్మర్

నగరి: మండలంలోని తడుకుపేట వద్ద జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం వేగంగా వస్తున్న కారు అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొంది. సమయానికి కారులోని ఎయిర్ బెలూన్ ఓపెన్ కావడంతో డ్రైవర్‌కు ప్రాణాపాయం తప్పింది. కారు ఢీ కొనడంతో ట్రాన్స్‌ఫార్మర్ రోడ్డుపై పడింది. సమయానికి రోడ్డుపై వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. అయితే రోడ్డుకు అడ్డంగా విద్యుత్ స్తంభం, తీగలు ఉండడంతో వాటిని తొలగించే వరకు రోడ్డుపై వాహనాలు చాలా దూరం వరకు ఆగిపోయా యి. చెన్నై నుంచి తిరుమలకు వెళ్లే సమయంలో ఈ ప్రమాదం జరిగిందని డ్రైవర్ తెలిపారు.

అ‘పూర్వ’కలయిక

విజయపురం (వడమాలపేట): వడమాలపేట ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో గేట్ టు గెదర్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తమ ఉన్నతికి కారణమైన గురువులను ఘనంగా సన్మానించారు. గత జ్ఞాపకాలను, అనుభవాలను నెమరు వేసుకున్నారు. అనంతరం అందరూ కలసి విందు భోజనాలు ఆరగించారు. రవి, ముని తదితరులు పాల్గొన్నారు.

శాలివాహన’ సమావేశం



సమావేశానికి వచ్చిన సభ్యులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో ఆదివారం శాలివాహన కులస్తుల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సభ్యత్వ ఎంపిక, కమ్యూనిటీ హాల్ భవనం, కాణిపాకంలో సత్రం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడం, నియోజక వర్గాల కార్యవర్గ నియామకం తదితర అంశాలపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిశేషయ్య నేతృత్వంలో చర్చించారు. సమావేశంలో అడ్వకేట్ దామోదరం, కమిటీ సభ్యులు కె.దేవరాజులు, మల్లయ్య, సీహెచ్ రత్నశేఖర్, ఉదయ్ కుమార్, వెంకటేశ్వర్లు, నాగరాజు, దామోదరంహరి, చలపతి, బాలాజీ పాల్గొన్నారు.

రేషన్ కందికొక్కులు

ప్రభుత్వం ప్రతి నెలా రాయితీపై అందిస్తున్న కంది పప్పుల్లో డీలర్లు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. సిండికేట్‌గా మారి అక్రమాలకు పాల్పడుతున్నారు. కిలో కందిపప్పు రూ.67 అమ్మాల్సిన డీలర్లు రూ.80–100 లెక్కన అమ్మేస్తూ నెలకు లక్షల రూపాయలు అక్రమంగా సంపాదిస్తున్నారు. ఇదేమని కార్డుదారులు ప్రశ్నిస్తే ‘మార్కెట్‌లో రూ.200 అమ్ముతుంటే 80 రూపాయలు కూడా ఇవ్వలేరా.. మేం ఎలా బతకాలి.. ఇష్టం ఉంటే తీసుకోండి లేకుంటే వెళ్లండి కందిపప్పు లేదు’ అంటూ సమాధానం ఇస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

- రూ.67కి విక్రయించాల్సిన కందిపప్పు రూ.75–100
- షాపులన్నీ తమ్ముళ్లవే
- చోద్యం చూస్తున్న అధికారులు
- నల్లబజారులో రేషన్ కందిపప్పు



విజయపురం(వడమాలపేట): కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక పౌరసరఫరాల శాఖలో అక్రమాలు కొత్తపుంతలు తొక్కుతున్నాయి. రేషన్ డీలర్లు సిండికేట్‌గా మారి పేదలకు కడుపు కొడుతున్నారు. కందిపప్పును ఇవ్వకుండా చేస్తున్నారు. కొన్నిచోట్ల కిలో రూ.67 అమ్మాల్సిన కందిపప్పును రూ.75కి అమ్ముతున్నారని లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. మరికొన్నిచోట్ల కందిపప్పు రాలేదని, స్టాక్ అయిపోయిందని నల్లబజార్లలో కిలో రూ.100కి అమ్మకుంటున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి.

నియోజకవర్గంలో 71138 కార్డులు

నగరి నియోజకవర్గంలో మొత్తం 204 రేషన్ షాపులు, 71138 కార్డులు ఉన్నాయి. వీరికి ప్రతి నెలా ఉచిత బియ్యంతోపాటు పంచదార, కందిపప్పును ప్రభుత్వం సబ్సిడీ ద్వారా అందిస్తోంది. గత వైఎస్‌ఆర్ సీపీ ప్రభుత్వ ఇంటింటికీ వెళ్లి ఉచిత బియ్యంతోపాటు కిలో పంచదార, కిలో కందిపప్పును అందజేశారు. కిలో కందిపప్పు రూ.67కే పంపిణీ చేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక రేషన్ బండి మూలనకు చేరింది. ఎక్కడో కొన్ని చోట్ల మాత్రమే బండిలో సరఫరా చేస్తున్నారు. ప్రధానంగా నగరి, పుత్తూరు పట్టణ, రూరల్ పరిధిలో ఇంటింటికీ రేషన్ సరఫరా చేయడం లేదు.

వసూలు ఇలా..

ఒక్కో రేషన్ కార్డుపై కిలో కందిపప్పు రూ.67 చొప్పున ప్రభుత్వం సరఫరా చేస్తుండగా డీలర్లు మాత్రం రూ.75 నుంచి రూ.100 చొప్పున వసూలు చేస్తున్నారు. అంటే కందిపప్పుపై అదనంగా రూ.8 నుంచి 33 అదనంగా తీసుకోవడంతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. ఒక్కో డీలర్లు సగటున ప్రతినెలా 2వేల మంది కార్డుదారులకు రేషన్ పంపిణీ చేస్తున్నారు. నెలకు ఒక్కో డీలర్లు రూ.8000 వేలు నుంచి రూ.66,000 వరకు సంపాదిస్తున్నారు. ఇలా డీలర్లు అదనంగా వసూలు రూ.లక్షలు దాటిపోతోంది. ఇంత బహిరంగంగా దోపిడీ చేస్తున్నా సివిల్ సప్లయిస్ అధికారులు తమకేమీ పట్టనట్లే వ్యవహరిస్తున్నారే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నల్లబజారులో రేషన్ కందిపప్పు

నగరి నియోజకవర్గంలో పెద్దఎత్తున ‘రేషన్ కంది పప్పు’ నల్లబజారుకు తరలించినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ చౌకధరల దుకాణాల్లో పంపిణీ ప్రక్రియ ప్రారంభమైన రెండు మూడు రోజులకే కంది పప్పు నో స్టాక్‌గా మారడం ఇందుకు బలం చేకూర్చుతోంది. కొందరు రేషన్ డీలర్లు వచ్చిన కంది పప్పు అయిపోయిందంటూ... మరి కొందరు పూర్తి కోటాను దిగమింగి ఈ సారి కంది పప్పు రాలేదంటూ లబ్ధిదారులను తిప్పిపంపుతున్నారు బహిరంగ మార్కెట్లో ధర పెరగడంతో డీలర్లు చేతివాటం ప్రదర్శించి లబ్ధిదారులు పంపిణీ చేయకుండా పక్కదారి పట్టించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం మార్కెట్లో ధర కిలో రూ.200 పలుకుతుండగా.. చౌకధరల దుకాణాల ద్వారా సబ్సిడీపై రూ.67కి పంపిణీ చేయాల్సి ఉంటుంది. ఈ వ్యత్యాసం ఫలితంగా చౌక ధర కంది పప్పు గుట్టుచప్పుడు కాకుండా డీలర్లు సొమ్ము చేసుకుంటున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు. కలెక్టర్ స్పందించి ఈ అదనపు వసూళ్లకు అడ్డుకట్ట వేయాలని కార్డుదారులు కోరుతున్నారు.

రేషన్ షాపులు, కార్డులు

మండలం	షాపు	కార్డులు
నగరి	66	26562
నింద్ర	28	8769
విజయపురం	33	5966
పుత్తూరు	42	20045
వడమాలపేట	35	9796
మొత్తం	204	71138

“

చర్యలు తీసుకుంటాం.

ప్రభుత్వం కిలో కంది రూ.67కి అందిస్తుంది. దీనిపై ఒక్క రూపాయి కూడా ఎక్కువగా అమ్మకూడదు. రూ.67 కంటే ఎక్కువగా అమ్ముతున్నట్లు తెలిసే వెంటనే మాకు సమాచారం ఇస్తే, కఠిన చర్యలు తీసుకుంటాం.

– కిరణ్, తహసీల్దార్, విజయపురం

రహదారిపైనే గ్రానైట్ వ్యర్థాలు



జాతీయ రహదారిపై రోడ్డు పక్కనే గ్రానైట్ వ్యర్థాలు

గంగాధరనెల్లూరు: మండలంలోఫ్యాక్టరీలు ఎక్కువగా ఉండడంతో గ్రానైట్ వ్యర్థాలు ఎక్కడబడితే అక్కడ పడేస్తున్నారు. చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారిపై ఎక్కడబడితే అక్కడ గ్రానైట్ వ్యర్థాలను రోడ్డు పక్కన పోయడంతో ప్రమాదావకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అధికారులు చొరవతీసుకుని వ్యర్థాలను పడవేయకుండా ఫ్యాక్టరీ యాజమాన్యాలకు హెచ్చరికలు జారీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

దుస్థితిలో వెటర్నరీ భవనం



45 సంవత్సరాల పాత పశుసంవర్ధక శాఖ ఏడీ ఆసుపత్రి భవనం

- పాములు, దోమల బెడద
- ఇబ్బందులు పడుతున్న అధికారులు



పెచ్చులూడిపోయిన ఆసుపత్రి భవనం పైకప్పు

గంగాధరనెల్లూరు: మండల మండల కేంద్రంలోని పశుసంవర్ధక శాఖ ఆసుపత్రి భవనం దుస్థితికి చేరుకుంది. ప్రారంభించి 45 సంవత్సరాలైనా అభివృద్ధికి నోచుకోవడంలేదు. ఈ ఆసుపత్రిలో జీడీ నెల్లూరు, పాలసముద్రం మండలాల పశువులకు వైద్యం చేస్తున్నారు. ఈ ఆసుపత్రి పరిధిలో ఒక ఏడీ, ఐదుగురు డాక్టర్లు, 21 మంది వెటర్నరీ సహాయకులు, పదిమంది గోపాల మిత్రలు పనిచేస్తున్నారు. ఆసుపత్రి భవనంలో కనీస అవసరాలు లేకపోవడంతో వీరంతా ఇబ్బందులు పడుతున్నారు. ఈ వెటర్నరీ ఆసుపత్రి అప్‌గ్రేడ్ అయ్యి ఎట్టేరి, సిద్ధేశ్వరకొండ, తూగుండ్రం, పాలసముద్రం మండలంలోని పశుసంవర్ధక శాఖ ఆసుపత్రులు ఈ ఏడీ పరిధిలోకి వచ్చాయి. వీరందరికీ నెలలో రెండు లేదా మూడుమార్లు మీటింగులు పెట్టుకోవాల్సి ఉంటుంది. కూడా భవనం లేకపోవడంతో ఇక్కట్లు తప్పడం లేదు. పెనుమూరు మండలంలో ఉన్న వ్యవసాయ శాఖ నియోజకవర్గ శాల ప్రయోగశాలను కూడా ఇక్కడికే మార్చారు. గదుల కొరతతో ఓ మూలన ఈ ప్రయోగశాల యూనిట్‌ను నిర్వహిస్తున్నారు.

శిథిలావస్థ

45 సంవత్సరాల ఈ భవనం శిథిలావస్థకు చేరుకుంది. వర్షాలకు ఉరుస్తూ, ప్రతి రూములో గోడలు నెరియలు చీలిపోయి ఉన్నాయి. వర్షపు నీటికి ఆసుపత్రిలోని ఫ్రిడ్జ్‌లు, కంప్యూటర్లు తడిచిపోయి పనికి రాకుండా పోయాయి. ఏడీగా విధులు నిర్వహిస్తున్న మురళీమోహన్ తన పర్సనల్ లాప్‌టాప్‌తో కార్యకలాపాలు సాగిస్తున్నారు. ఆసుపత్రి పరిధిలో దాదాపు 30 వేల పశువులు, 25 వేల గొర్రెలతో కూడిన పశుసంపద ఉంది. ఆసుపత్రి ఆవరణలో పలుమార్లు పాములు రూముల్లోకి వచ్చేస్తున్నాయి. దీంతో అధికారులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఈ సమస్యలపై జిల్లా అధికారులు ఇప్పటికైనా దృష్టి సారించాలని సిబ్బంది, పాడిరైతులు కోరుతున్నారు.

త్వరలోనే పరిష్కరించాలి

పాములు, దోమల బెడదతో ఏడీ కార్యాలయంలో ఆసుపత్రి సిబ్బంది అధికారులు ఇబ్బందులు పడుతున్నాం. పాత భవనం కావడంతో వర్షపు నీరు గోడల్లోకి చేరడంతో కార్యాలయంలోని ఫ్రిడ్జ్ కంప్యూటర్ తడిచిపోయి, చెడిపోయాయి. సొంత డబ్బులతో పలుమార్లు రిపేర్లు చేయించినా సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించలేకపోతున్నాం. జిల్లా స్థాయి అధికారులు సాధ్యమైనంత త్వరగా సమస్యలను పరిష్కరించాలి. – మురళీమోహన్, ఏడీ, పశుసంవర్ధక శాఖ, జీడీ నెల్లూరు





వర్షానికి ఉరుస్తూ పనికి రాకుండా పోయిన ఫ్రిడ్జ్, గోడల్లో వస్తున్న వర్షపు నీరు కారడానికి పెట్టిన చిన్న బకెట్



ఆసుపత్రి బిల్డింగ్ పైన పెరిగిన పిచ్చి మొక్కలు, నెర్రెలు చీలిన గోడలు